క్లుప్తంగా

జాకోరాలో కుస్తీ పోటీలు



వర్ని: మండలంలోని జాకోరాలో బారేడు పోచమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుస్తీపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



బాల్కొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల రాష్ట్ర పరిశీలకురాలు అలైస్ వాజర్ అన్నారు. ముప్కాల్, బాల్కొండ, మెండోరా మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతుల గురించి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, తహసీల్దార్లు వనజ రాణి, శ్రీధర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నంది జయంతి

నందిపేట్: మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో శుక్రవారం నంది జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నంది విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు మచ్చర్ల సాగర్, గాండ్ల నర్సాగౌడ్, సామల ముత్యం, దుబాయి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యహైస్కూల్ అధినేత విద్య ప్రవీణ్ పవార్ విద్యారంగంలో అందిస్తున్న ఉత్తమ సేవలకు ఎడ్యుకేషనల్ లీడర్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో టైం టు గ్రో మీడియా సంస్థ 20వ ఎడ్యుకేషనల్ విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌కు చెందిన ప్రవీణ్ పవార్ టైం టు గ్రో మీడియా వ్యవస్థాపకుడు మన్మీత్ ఖురణ, ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా, సిల్వర్ ఓక్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సీతామూర్తి చేతుల మీదుగా ఎడ్యుకేషన్ లీడర్ అవార్డు అందుకున్నారు. ఇలాగే విద్య రంగంలో మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని వారు కోరారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



ధర్పల్లి: ప్రతి ఒక్కరూ బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళ శిశు సంక్షేమ శాఖ, బాల రక్షా భవన్ ఆధ్వర్యంలో మహిళలకు, కిశోర బాలికలకు చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. బుజ్జి మాట్లాడుతూ.. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించడం, చదివించడం వల్ల సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పరిసరాల శుభ్రతతోపాటు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. బాల రక్షక్ సిబ్బంది జ్యోత్స్న, ప్రవంతి పాల్గొన్నారు.

ఆర్మూర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- పారిశుధ్యంపై ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న కమిషనర్
- తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- కాలనీల్లో తడిపొడి చెత్త సేకరణపై అవగాహన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: పట్టణ అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ రాజు ప్రత్యేక దృష్టిసారించారు. పాలనను గాడిలో పడేసే ప్రయత్నం చేస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయం చేపడుతున్న పనులను పరిశీలిస్తున్నారు. చెత్త సేకరణ సిబ్బంది ప్రతిరోజు కాలనీల్లో చెత్త సేకరిస్తున్నారో లేదో తెలుసుకునేందుకు ఉదయం 6 గంటలకే కార్మికులు చేపడుతున్న పనుల ప్రదేశాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో ప్రతిరోజు 125 మంది పారిధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. 10 ట్రాక్టర్లు, 22 ఆటో ట్రాలీలు ప్రతిరోజు కాలనీల్లో తిరుగుతూ చెత్త సేకరణ చేస్తున్నాయి. ప్రతి వార్డులో తాగు నీటి సమస్య లేకుండా ఉండేందుకు వార్డులో తిరుగుతూ.. ప్రభుత్వ బోర్లు, చేతిపంపులను పరిశీలిస్తూ చెడిపోయిన వాటిని మరమ్మతులు చేయిస్తున్నారు. అలాగే ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లను త్వరితగతంగా వసూలయ్యేలా చేస్తున్నారు.

ఉదయం 6 గంటలకే..

పట్టణంలోని కాలనీల్లో ఉదయం 6 గంటలకే మున్సిపల్ కమిషనర్ రాజు తిరుగుతూ కార్మికులు చేపడుతున్న పనితీరు ఏవిధంగా ఉందో ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది విధుల్లో చేరిన రిజిస్టర్‌ను నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని జవాన్లకు సూచిస్తున్నారు. కాలనీల్లో ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్నారు. చెత్తను బయట వేయకుండా మున్సిపల్ నుంచి వచ్చే వాహనాల్లో మాత్రమే చెత్త వేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రజలు సహకరించాలి



ఎక్కడైనా పారిశుధ్య నిర్వహణ సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలి. కార్మికులు తమ విధులు సక్రమంగా నిర్వహించి పట్టణ సుందరీకరణకు కృషిచేయాలి. పారిశుధ్యంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేణ చేపడుతూ పనులు చేపడుతున్నాం. ప్రజలు సైతం చెత్తను బయట వేయకుండా సహకరించాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్

కాంగ్రెస్ హామీలు నమ్మొద్దు



కొడిచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం



చిట్టాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంత్‌రెడ్డి



రెంజల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- ప్రచారాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

రుద్రూర్/ బాల్కొండ/ బోధన్‌టౌన్/ పెర్కిట్/ రెంజల్/ వేల్పూర్/ భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబు తున్న మోసపూరిత హామీలను నమ్మొద్దని బాన్సు వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పా తంగల్ మండలం కొడిచర్ల, హంగర్గా గ్రామాల్లో ఎ న్నికల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బాల్కొండ మండ లం చిట్టాపూర్, మెండోరా మండలం బుస్సాపూర్, సోన్‌పేట్ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. బో ధన్‌లోని 15వ వార్డులో శివాలయం కమిటీ మాజీ చైర్మన్ బీర్కూర్ శంకర్ నాయకులతో కలిసి ప్రచా రం చేపట్టారు. ఆలూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రెంజల్ పెద్ద చెరువులో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేపట్టారు. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రచారాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండంలోని పల్లికొండ, ముచ్కూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు.

బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త



సాలూరలో విగ్రహానికి పూలమాల వేస్తున్న శంకర్



సుంకినిలో విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే

- జయంతి వేడుకల్లో సమాజ్ ప్రతినిధులు

బోధన్: మహాత్మా బసవేశ్వరుడు సమాజంలోని కుల వ్యవస్థను, లింగ విభేదాలు, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది, గొప్ప సంఘ సంస్కర్తని వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధులు అన్నారు. సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో బసవేశ్వరుడి భారీ విగ్రహానికి సమాజ్ ప్రతినిధులు పూజలు చేశారు. విగ్రహం ఎదుట కాషాయ జెండాను సమాజ్ గ్రామ అధ్యక్షుడు శివపూజ శంకర్ ఆవిష్కరించారు. ప్రతినిధులు గంటె వీరేశ్, బండె శివరాజ్, కాసిరెడ్లి హన్మంత్‌రావు, భయ్యన్ సురేశ్ పటేల్, సొసైటీ మాజీ చైర్మన్ శివప్ప పటేల్, సీతవో బస్వంత్‌రావు పటేల్, సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని మాతృశ్రీ హైస్కూల్‌లో బసవేశ్వరుడి జయంతిని నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వీఆర్ దేశాయ్, జంగమ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అప్ప, ఏకచక్రేశ్వరాలయ కమిటీ చైర్మన్ కర్నె హన్మంత్‌రావు, సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గైనిగుట్టలో

రుద్రూర్: మండలంలోని శ్రీస్వయం భూబసవేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు పరమేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పొతంగల్ మండలం సుంకినిలో ఏర్పాటు చేసిన బసవేశ్వర మహరాజ్ విగ్రహాన్ని బిచ్కుంద మఠాధిపతి సోమాయప్ప ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మాధవ రావు, వెంకటేశ్వర్‌రావు దేశాయ్, దిగంబర్ పటేల్, మాజీ ఎంపీటీసీ సిద్ధిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి, పొతంగల్ మండలాల్లో మహాత్మ బసవేశ్వర జయంతిని వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలో బస్వేశ్వర విగ్రహానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కోటగిరిలో వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడు గంగాధర్ దేశాయ్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. కార్యక్రమాల్లో ప్రతినిధులు హనుమంత రావు, శివరాజ్ దేశాయ్, మల్లికార్జున్ పటేల్, దిగంబర్ పటేల్, శాంతేశ్వర్ పటేల్, సంతోష్ కుమార్, మాణికప్ప తదితరులు పాల్గొన్నారు.

చేరికలు..

కాంగ్రెస్‌లో..



కమ్మర్‌పల్లి/ నందిపేట్: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. వీరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నందిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో నందిపేట మండల ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు జావిద్, మండల ఉప సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు గోపు ముత్యం, ఉపసర్పంచ్ మచ్చల ముత్యం, మచ్చర్ల రాములు, పలువురు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, సొసైటీ చైర్మన్ బొంకం గంగారెడ్డి, ముజారొద్దీన్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో..



బాల్కొండ/ మాక్లూర్: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సెరియాల జగన్, మండలంలోని శ్రీరాంపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ మంథని చిన్నయ్య బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఎంపీ అర్వింద్ వీరికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మాక్లూర్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, మరో 40 మంది కార్యకర్తలు బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బీఆర్‌ఎస్‌లో..



వేల్పూర్/ ఎడపల్లి: మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో కాంగ్రెస్ నాయకులు దోని సత్తయ్య, నవీన్, రాజన్న, నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో కమలాకర్, సాగర్‌గౌడ్, శేఖర్, మల్లేశ్, సాయి, మహేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలంలోని పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయేషా ఫాతిమా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఆమె కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఏబీవీపీ మండల మాజీ కన్వీనర్, బీజేపీ యువ మోర్చ మండల కన్వీనర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నాయిని సతీశ్ గౌడ్, నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, ఎంపీటీసీ మనీషా సాయిరెడ్డి, నాయకులు కట్టర్ శ్రీకాంత్, అనిల్, ఆదిల్ పాల్గొన్నారు.



ధర్పల్లి ఆస్పత్రి తరలింపు

ధర్పల్లి: ధర్పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను గ్రామంలోని బీసీ హాస్టల్ భవనంలోకి తాత్కాలికంగా మార్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శివ శంకర్ శుక్రవారం తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రి 30 పడకల నుంచి వంద పడకల ఆస్పత్రికి అప్‌గ్రేడ్ కావడంతో పాత భవనాన్ని కూల్చివేసి, నిర్మాణం చేపట్టడంతో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ సుశాంత్‌రెడ్డి, సిబ్బంది నారాయణ కృష్ణా, రమేష్, వాజిద్, నరేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం



భీమ్‌గల్: మోసపూరిత హామీలతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో కూలిపోవడం ఖాయమని, ప్రభుత్వం పడిపోవాలని ప్రజలు పూజలు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని మెండోరాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. త్వరలోనే ఒకే దేశం, ఒకే చట్టం అమల్లోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, ఆరె రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎంపీ అర్వింద్‌కు బుద్ధి చెప్పాలి



సమావేశంలో అభివాదం తెలుపుతున్న నాయకులు

- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

మోర్తాడ్: రైతులను పసుపు బోర్డు పేరిట మభ్యపెట్టి మోసగించిన ఎంపీ అర్వింద్‌ను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు కోరారు. మోర్తాడ్‌లో రైతు ఐక్య కార్యాచరణ నాయకులు ప్రభాకర్, అన్వేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 2019 ఎన్నికల్లో నాటి బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ కవిత పసుపు బోర్డుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని రైతులు 178 మందితో పోటీ చేయించి అర్వింద్ విజయానికి కారణమయ్యామని తెలిపారు. ఎంపీగా అర్వింద్ గెలిచిన తర్వాత పసుపు బోర్డుపై దాటవేస్తూ వచ్చారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో పసుపు బోర్డు ప్రకటన చేయించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ ఎన్నికల్లో అర్వింద్‌కు తగిన గుణపాఠం చెప్పాలని రైతు ఉద్యమ నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మంథని గంగారాం, బి దేవారాం, లింగారెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లారెడ్డి, సురేశ్, జి కిషన్, సత్యనారాయణ, అశోక్, సత్తెమ్మ, నరేందర్, గిర్మాజి గోపి, బూత్‌పురం మహిపాల్, పడిగెల ప్రవీణ్, పాలెం ప్రవీణ్, జైడి చిన్న గంగారాం, కుర్మ నరేశ్, నాగభూషణం, లచ్చల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుందాం



సిరికొండ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తగ్గిపోయి మూతపడే స్థితికి రావడంతో బడిని కాపాడుకుందామని గ్రామస్తులు తీర్మానించా రు. గ్రామంలోని పిల్లలు ప్రయివేటు పాఠశాలలకు వెళుతుండటంతో ఈ ఏడాది ప్రభుత్వ పా ఠశాలలో విద్యార్థుల సంఖ్య అరవై వరకు మా త్రమే ఉంది. ఈ విషయమై ఉపాధ్యాయులు వీడీసీకి వివరించారు. ఈక్రమంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. విద్యార్థులను ప్రయివేటు పాఠశాలలకు పంపవద్దని, వారిని పంపకుండా ఆయా కుల సంఘాలు బాధ్యత తీసుకోవాలని తీర్మానించారు. ప్రయివేటు బడులకు విద్యార్థులను పంపితే, వారి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు నిలిపివేసేలా చూడాలని నిర్ణయించారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం



నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో వేద పండితులు యజ్ఞం చేశారు. సహస్ర కలశ పూజ, శాంతి పీఠం, బలిహరణం, విష్ణు సహస్రనామ పారాయణం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 01.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15
స్క్రీన్-2 –	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ - 11.45, 2.55, 6.05, 9.15
స్క్రీన్-3 –	ప్రతినిధి-2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
స్క్రీన్-4 –	కృష్ణమ్మ (తెలుగు)- 12.45, 3.40, 6.35, 9.30

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం

- ప్రచారాల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్/ బోధన్ టౌన్/ ఆర్మూర్/ డొంకేశ్వర్/ బాల్కొండ/ రుద్రూర్/ పెర్కిట్/ ఎడపల్లి/ నందిపేట్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ మండలంలోని ఊట్‌పల్లి, రాజీవనగర్ తండాల్లో ఎన్నికల ప్రచారం, బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో కార్నర్ మీటింగ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్మూర్ అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్మూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. డొంకేశ్వర్ మండంలంలోని దత్తాపూర్, నూత్పల్లి, మారంపల్లి, గంగసరం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి ప్రచారం నిర్వహించారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి, మెండోరా మండలం బుస్సాపూర్, సోన్‌పేట్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలోని దామరచెరువులో కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలూర్, రెంజల్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేటలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. నందిపేట మండలంలోని బజార్‌కొత్తూర్, పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లిలో సీపీఐఎం బోధన్ నియోజకవర్గ కార్యదర్శి యేశాల గంగాధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రచారాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఊట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఏబీ శ్రీనివాస్



నూత్‌పల్లిలో మాట్లాడుతున్న అరికెల నర్సారెడ్డి



కొత్తపల్లిలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి